

# మినీకథావీధి

## ప్రయాణీకుడు



కె. సుబ్రహ్మణ్యం

విజయవాడ జంక్షన్ ప్లాటుఫాం మీద అప్పుడే హౌరావైపు వెళ్ళే ట్రయిన్ వచ్చి ఆగింది.

ప్లాటుఫాం పొడుగునా యిసకవేస్తే రాలని జనం ఎవరి హడావిడిలో వారున్నారు.

మూర్తి టిక్కెట్టు కొన్నా, రిజర్వేషను దొరకలేదు. తాను జనరల్ కోచీలో ప్రయాణించవల్సి వుంది. బ్రీఫ్ కేసు పుచ్చుకుని పెట్టెలు గాలిస్తున్నాడు.

జనరల్ కోచీ దగ్గర గుంపులుగా ప్రయాణీకులున్నారు. కుమ్ములాడుతూ, కేకలుపెడుతూ లోపలికి ఎక్కేస్తున్నారు. కాస్సేపటికి పెట్టె నిండిపోయింది. నిలుచోటానికక్కడ ఖాళీ దొరకటం కష్టమై పోతోంది.

మూర్తి యుక్తిగా ఓ ప్రక్కనుంచి తోసుకుంటూవెళ్ళి ఎలాగోలా తంటాలుపడి పెట్టెలోకి జొరబడ్డాడు. ఒక్కక్షణం ఆగకుండా డోర్ నెట్టేసి లోపల లాచ్ బిగించేశాడు. దాంతో బయటివాళ్ళు లోనికి రాకుండా చేసేశాడు. బయటివాళ్ళు డోర్ దబదబ బాదుతున్నారు. అరుస్తున్నారు. అయినా మూర్తికి జాలిపుట్టలేదు. బయటివాళ్ళంతా యెక్కేస్తే అస్సలే వూపిరి పీల్చుకోవటం కష్టం. తనకెలాగో ప్రవేశం దొరికిందే పదివే లనుకున్నాడు తృప్తిగా మూర్తి.

మూర్తి సాహసానికి మెచ్చుకోలుగా ఒకాయన తన సీటు ప్రక్కనే కాస్త జాగా చూయించాడు. కృతజ్ఞతతో అక్కడ చతికిలబడ్డాడు. ఇహ తనకి ఏ తాపత్రయమూ లేదు.

బయట కిటికీలోకి తలదూర్చి "మూర్తీ మూర్తీ?" అంటూ ఎవరో పిలుస్తున్నారు.

మూర్తి కిటికీవైపు దృష్టి సారించి—"ఏరోయ్ శాస్త్రీ! ఇక్కడున్నాను" అన్నాడు అవతల వ్యక్తితో.

"దిగరా భాయ్! మన రామం వచ్చాడు. అర్జంటుగా మాట్లాడాలిట. ఇంత రద్దీలో ఎలాగా? ఇంకా బోల్డు టైముంది లేరా!" అంటూ తొందరపెట్టేస్తున్నాడు శాస్త్రి.

మూర్తి మరి ఆలోచించక, జబర్దస్తీగా డోర్ లాచ్ తీసేసి అమాంతం ప్లాటుఫాం మీదికి దూకేశాడు. ఇద్దరూ జనం గుంపులో కలిసిపోయారు.

లోపల్నుండి ఎవరో డోర్ లాచ్ బిగించేశాడు వెంటనే.

గంట కొట్టారు. ట్రయిన్ క్షణాల్లో కదులుతుందన్న సూచన.

ఎక్కుణుంచో తిరిగి మూర్తి వక్కదే వగుర్చుకుంటూ ఇందాక ఎక్కిన పెట్టె వద్దకి చేరాడు. అక్కడున్న జనాన్ని తప్పుకుంటూ ఫుట్ బోర్డు మీద నిల్చుని—

"తలుపు తియ్యండి! ప్లీజ్!" అని అడిగాడు ప్రాధేయపూర్వకంగా.

"పోవయ్యా! కిన్పట్టంలా? ఖాళీలేదు" కిటికీ దగ్గర కూచున్న ఆసామీ అరిచాడు.

"అయ్యో! నేనేనండీ! ఇందాక మీ పెట్టెలోనే ఎక్కాను. అర్థాంతంగా దిగవల్సిన పని వచ్చి వెళ్ళాను. బండి కదులుతోంది. ప్లీజ్! లోపల లాచ్ తీయండీ!"

"తెలుసు బాబూ! ఎక్కడో జాగా దొరికినట్లు వెళ్ళిపోయారే! తలుపు తెరిస్తే మీతో పాటు ఇతర్లూ చోటివ్వమంటారు. నించోటమే కష్టంగా వుంది. ఎలాగుమరి?" అన్నారెవరో.

గార్డు పచ్చజెండా ఊపుతున్నాడు. ఇంజన్ కర్ణకఠోరంగా కూత పెట్టింది.

మూర్తికి ఆందోళన ఎక్కువైంది.

పెట్టెలో నిల్చున్న ఓ పుణ్యాత్ముడు మూర్తి పడుతున్న అవస్థ చూశ్ళేక డోర్ లాచ్ తీసి తెరిచాడు. మూర్తి 'థాంక్స్' అంటూ లోపలికి అడుగుపెట్టాడు. ఇంతలో వెనకనుండి ఎవరో బలంగా నెట్టారు. మూర్తి వెనుదిరిగి చూశాడు. ఇద్దరు కాలేజీ కుర్రాళ్ళలా వున్నారు.

"దిగండి! దిగండి! కొత్తిగా చోటులేదిక్కడ!" మూర్తి అసహనంగా అరిచాడు.

"ఏం ఫరవాలేదు సార్? మే మిద్దరమే వున్నాం. ఇంకెవ్వర్నీ పెట్టెలోకి రానియ్యం!" అన్నాడో అబ్బాయి డోర్ మూసేసి లాచ్ వేసేస్తూ!

లోపలున్న వాళ్ళు ఒక్కసారి పెట్టె అదరగొట్టేసూ గొల్లున నవ్వారు.

బండి కదిలింది.



## ఆలి బ్రతుకు

రాజ్య మేలింది రాముడైనప్పుడే
అడవిపాలైందతని ఆలి బ్రతుకు
జూదం ఓడింది మగడైతే
సభ కీడ్చిందతని ఆలి బ్రతుకు
అప్పు చేసింది తన అహమైతే
అమ్మకం పెట్టిందతని ఆలి బ్రతుకు
ఇక్ష్వాకుల కాలం నుండి ఇలలో
ఇక్కట్లకు ఎర వేసిందిఇంతులనేకదా?

— కె. రత్నకుమారి